కనక్ పసిడి గురి

జూనియర్ షూటింగ్ ప్రపంచకప్

న్యూఢిల్లీ: జర్మనీ వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచ కప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతున్నది. బుధవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ ఈవెంట్‌లో కనక్ పసిడి పతకంతో మెరిసింది. మొత్తం ఎనిమిది మంది షూటర్లు పోటీ పడ్డ ఫైనల్లో ఈ 17 ఏండ్ల హర్యానా షూటర్ 239.0 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. రెండు సార్లు ఒలింపియన్ అన్నా డుల్సె(మాల్డోవా), చెన్ యెన్ చింగ్(చైనీస్ తైపీ) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

నాగల్ నిష్క్రమణ

పారిస్: త్వరలో మొదలుకాబోయే ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు నిర్వహిస్తున్న అర్హత పోటీలలో భారత్‌కు చుక్కెదురైంది. సింగిల్స్ విభాగంలో భారత ఆశలు మోస్తున్న సుమిత్ నాగల్.. మెయిన్ డ్రాకు అర్హత సాధించలేకపోయాడు. క్వాలిఫయింగ్ రౌండ్స్‌లో భాగంగా బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో నాగల్.. 2-6, 4-6తో జురిజ్ రొడియొనొవ్(ఆస్ట్రియా) చేతిలో ఓడటంతో ఫ్రెంచ్ ఓపెన్ సింగిల్స్ విభాగాల్లో భారత ప్రాతినిధ్యం లేకుండా పోయింది.

మే 24న ముహూర్తం

- **టీమ్‌ఇండియా టెస్ట్ కెప్టెన్ ప్రకటనకు తేదీ ఖరారు!**

ముంబై: టెస్టులలో భారత క్రికెట్ జట్టును నడిపించే కొత్త నాయకుడెవరో ఈనెల 24న తేలనుంది. రోహిత్‌శర్మ రిటైర్మెంట్ నేపథ్యంలో టెస్టులకు కొత్త సారథిని రాబోయే శనివారం ప్రకటించేందుకు బీసీసీఐ ముహూర్తం ఖరారు చేసింది. కెప్టెన్‌తో పాటు ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు భారత జట్టునూ అదే రోజు ప్రకటించనున్నట్టు సమాచారం. టీమ్‌ఇండియా హెడ్‌కోచ్ గౌతం గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ముంబైలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించనున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి.

ప్లేఆఫ్స్‌లో ముంబై

కీలక పోరులో ఢిల్లీపై ఘన విజయం

సూర్యకుమార్, సాంట్నర్, బుమ్రా విజృంభణ

సూర్య (73*)

ముంబై: ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు నాలుగో ప్లేఆఫ్స్ బెర్తు దక్కింది. బుధవారం జరిగిన కీలక పోరులో ముంబై 59 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించింది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ ముంబై..ఢిల్లీని తమ సొంతగడ్డపై మట్టికరిపించింది. మిగతా బ్యాటర్లు విఫలమైనా సూర్యకుమార్ యాదవ్ (43 బంతుల్లో 73 నాటౌట్; 7 ఫోర్లు, 4 సిక్సర్లు) మరో సూపర్ ఇన్నింగ్స్‌తో ముంబై ఇండియన్స్‌ను ఆదుకున్నాడు. సూర్యతో పాటు తిలక్ వర్మ (27), నమన్ ధీర్ (8 బంతుల్లో 24 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ముంబై టాపార్డర్ బ్యాటర్లు విఫలమైనా సూర్య.. పరిస్థితులకు తగ్గట్టుగా ఆడి ఈ సీజన్‌లో నాలుగో అర్ధ శతకంతో కదం తొక్కాడు. ఢిల్లీ బౌలర్లు 18వ ఓవర్ దాకా కట్టడిచేసినా చివరి రెండు ఓవర్లలో 48 పరుగులు సమర్పించుకున్నారు. 181 పరుగుల ఛేదనలో క్యాపిటల్స్ 18.2 ఓవర్లలో 121 పరుగులకే పరిమితమైంది. సమీర్ రిజ్వి (35 బంతుల్లో 39, 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. శాంట్నర్ (3/11), బుమ్రా(3/12) ఢిల్లీని దెబ్బకొట్టారు.

సూర్య 'వన్ మెన్ షో'

మొదట బ్యాటింగ్ చేసి 58 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన ముంబైని సూర్య, తిలక్ ఆదుకోకుంటే ఆ జట్టు పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. రోహిత్ (5), రికెల్టన్ (25), జాక్స్ (21) నిరాశపరిచిన చోట సూర్య.. తిలక్ వర్మతో కలిసి అతడు నాలుగో వికెట్‌కు 55 పరుగులు జోడించాడు. పవర్ ప్లేలో వికెట్లు కోల్పోయినా వేగంగా రన్స్ రాబట్టిన ముంబై.. స్పిన్నర్లు కుల్‌దీప్, విప్రాజ్ రాకతో నెమ్మదించింది. సూర్య-తిలక్ జోడీ తమ సహజ శైలికి భిన్నంగా ఆడటంతో ఆ జట్టు వంద పరుగుల మార్కును అందుకోవడానికి 14 ఓవర్లు పట్టింది. ఈ క్రమంలో బౌలింగ్ మార్పుగా వచ్చిన ముకేశ్.. తిలక్‌ను ఔట్ చేసి ముంబైని దెబ్బకొట్టాడు. హార్దిక్ పాండ్యా (3)ను చమీర ఔట్ చేశాడు. 18 ఓవర్లకు ముంబై స్కోరు 132/5 మాత్రమే. కానీ ఆ తర్వాత రెండు ఓవర్లలోనే ముంబై 48 పరుగులు పిండుకుంది. ముకేశ్ 19వ ఓవర్లో తొలి బంతికి సిక్సర్‌తో సూర్య అర్ధ శతకం పూర్తిచేశాడు. మూడో బంతికి స్ట్రైకింగ్ తీసుకున్న నమన్.. 4, 6, 6, 4 బాదడంతో ఆ ఓవర్లో 27 రన్స్ వచ్చాయి. చమీర ఆఖరి ఓవర్లో సూర్య.. 4, 6, 6, 4తో 21 పరుగులు రాబట్టడంతో ముంబై భారీ స్కోరు సాధించింది.

తల్ల'ఢిల్లీ'న క్యాపిటల్స్

లక్ష్య ఛేదనలో ఢిల్లీ రెండో ఓవర్లోనే తాత్కాలిక సారథి డుప్లెసిస్ (6) వికెట్ కోల్పోయింది. గత మ్యాచ్‌లో శతకంతో చెలరేగి ఆడిన కేఎల్ రాహుల్ (11).. ట్రెంట్ బౌల్ట్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ రికెల్టన్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఐదో ఓవర్లో పొరెల్ (6)ను రికెల్టన్ రెప్పపాటు తేడాతో స్టంపౌట్ చేయడంతో క్యాపిటల్స్ కష్టాలు రెట్టింపయ్యాయి. క్రీజులోకి రాగానే 6, 4, 4, 4తో దూకుడుగా ఆడేందుకు యత్నించిన విప్రాజ్ నిగమ్ (20).. శాంట్నర్ బౌలింగ్‌లో అతడికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఇక ఢిల్లీ భారీ ఆశలు పెట్టుకున్న స్టబ్స్ (2)ను బుమ్రా వికెట్ల ముందు బలిగొనడంతో క్యాపిటల్స్ ఓటమి దాదాపు ఖరారైంది. అశుతోష్‌తో కలిసి కొద్దిసేపు మెరుపులు మెరిపించిన సమీర్ రిజ్విని.. శాంట్నర్ ఒకే ఓవర్లో బోల్తా కొట్టించడంతో గెలుపుపై ఢిల్లీ ఆశలు వదులుకుంది. ఇక్క ణ్నుంచి ఢిల్లీ మళ్లీ కోలుకోలేదు. ఇదే అదనుగా ముంబై బౌలర్లు చెలరేగడంతో ఢిల్లీ 18.2 ఓవర్లలో 121 పరుగులకు కుప్పకూలింది. బుమ్రా, సాంట్నర్..ఢిల్లీ పతనాన్ని శాసించారు.

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్ ✓	12	9	3	0	18	0.79
బెంగళూరు ✓	12	8	3	1	17	0.48
పంజాబ్ ✓	12	8	3	1	17	0.38
ముంబై ✓	13	8	5	0	16	1.29
ఢిల్లీ X	13	6	6	1	13	-0.01
కోల్‌కతా X	13	5	6	2	12	0.19
లక్నో X	12	5	7	0	10	-0.50
హైదరాబాద్ X	12	4	7	1	9	-1.00
రాజస్థాన్ X	14	4	10	0	8	-0.54
చెన్నై X	13	3	10	0	6	-1.03

నోట్: జ-జట్టు, మ్యా.మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

సంక్షిప్త స్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో 180/5 (సూర్య 73*, తిలక్ 27, ముకేశ్ 2/48, కుల్‌దీప్ 1/22); **ఢిల్లీ:** 18.2 ఓవర్లలో 121 ఆలౌట్(రిజ్వి 39, నిగమ్ 20, సాంట్నర్ 3/11, బుమ్రా 3/12)

'బెంగ' తీరాలి!

ఐపీఎల్‌లో కొత్త విజేతను చూడాలనుకుంటున్న అభిమానులు

65 శాతం మంది అభిప్రాయమిదే ● ఆర్‌సీబీ 18 ఏండ్ల కరువు తీరాలని కోరిక

ముంబై: ఐపీఎల్‌లో ఒకటి కంటే ఎక్కువ సార్లు ట్రోఫీ నెగ్గిన విజేతలే మళ్లీ మళ్లీ కప్ కొట్టడాన్ని చూసి అభిమానులకు బోర్ కొట్టిందా? 18వ సీజన్‌లో వాళ్లు కొత్త విజేతను చూడాలనుకుంటున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఈ మేరకు '23 వాట్స్ ఇన్‌సైట్స్ స్టూడియో' అనే ఒక సంస్థ 'ది ఐపీఎల్ పల్స్' పేరిట ఒక సర్వేను నిర్వహించింది. ఢిల్లీ, లక్నో, ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో సుమారు 5 వేల మంది అభిమానుల వద్ద అభిప్రాయాలను సేకరించగా వారిలో ఏకంగా 65 శాతం మంది ఈ సీజన్‌లో ఇప్పటికే కప్పు కొట్టిన జట్లు కాకుండా కొత్త విజేతలను చూడాలనుకుంటున్నట్లు అభిప్రాయపడ్డారు. అదీగాక ఐపీఎల్-18లో అదిరిపోయే ఆటతో సమిష్టిగా రాణిస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 18 ఏండ్ల టైటిల్ కలను నెరవేర్చుకోవాలని 44 శాతం మంది కోరుకున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ విజేతగా నిలవాలని 12 శాతం మంది అభిప్రాయపడగా.. పంజాబ్ కింగ్స్‌ను చాంపియన్‌గా చూడాలనుకుంటున్నట్లు 7 శాతం మంది చెప్పారు. ఈ మూడు జట్లూ ఐపీఎల్‌లో ఇప్పటి వరకూ కప్పు కొట్టలేదు. మే 05 నాటికి ఈ అభిప్రాయాలను సేకరించినట్లు '23 వాట్స్' తెలిపింది. కాగా ఈ సీజన్‌లో ఇప్పటి దాకా ఆడిన 12 మ్యాచ్‌లలో 8 గెలిచిన బెంగళూరు.. ప్లేఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకున్న విషయం విదితమే.

ధోనీ కొనసాగాలి..

నాలుగు పదుల వయసులోనూ ఐపీఎల్‌లో ఆడుతున్న చెన్నై సూపర్ కింగ్స్ సారథి మహేంద్రసింగ్ ధోనీ మరికొన్ని సీజన్ల పాటు కొనసాగాలని 77 శాతం మంది చెప్పారు. ఈ సీజన్‌లో బ్యాటింగ్ విషయంలో ధోనీ తడబడుతున్నప్పటికీ అతడుంటే ఆటకు ఓ అందం వస్తుందని అభిప్రాయపడ్డారు. 35 శాతం మంది చెన్నై జట్టుకు ధోనీ ఆత్మ (సోల్ ఆఫ్ సీఎస్‌కే) వంటి వాడని తెలిపారు. 27 శాతం మంది ధోనీ రిటైర్ అయి సీఎస్‌కేకు మెంటార్‌గా ఉండాలని అన్నారు.

బుడ్డోడి ఆటకు ఫిదా

13 ఏండ్లకే ఐపీఎల్ వేలంలోకి వచ్చి 14 ఏండ్ల వయసులో ఈ లీగ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన బీహార్ చిన్నోడు వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై ఐపీఎల్ ఫ్యాన్స్ మనసు పారేసుకున్నారు. ఈ సీజన్‌లో అరంగేట్రం చేసి ఆకట్టున్న వారిలో వైభవ్ 31 శాతం ఓట్లతో అగ్రస్థానంలో ఉండగా ముంబై పేసర్ అశ్వని కుమార్ (21శాతం) రెండో స్థానంలో నిలిచాడు.

ఇక ఈ సీజన్‌లో బ్యాటర్లు ఎదుర్కున్న అత్యంత కఠిన బౌలర్ ఎవరన్న దానిపై 32 శాతం మంది బుమ్రాకు ఓటేయగా 28 శాతం మంది చెన్నై స్పిన్నర్ నూర్ అహ్మద్ వైపునకు మొగ్గుచూపారు. మూడో స్థానంలో గుజరాత్ టైటాన్స్‌కు ఆడుతున్న హైదరాబాదీ పేసర్ సిరాజ్ (16 శాతం) ఉన్నాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌పై క్రికెట్ వర్గాల్లో బిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండగా 78 శాతం మంది ఈ నిబంధన వల్ల ఆట మరింత రసవత్తరంగా మారిందని అభిప్రాయపడటం విశేషం. 20 శాతం మంది మాత్రం ఇది ఆల్‌రౌండర్లను దెబ్బతీస్తుందని తెలిపారు.

అబ్బాయిలు ముందుకు.. అమ్మాయిలు ఇంటికి

ప్రణయ్, శ్రీకాంత్ ముందంజ ● తొలి రౌండ్‌లోనే సింధు, బన్సోద్, ఉన్నతి ఔట్

కౌలాలంపూర్: మలేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్, కరుణాకరన్, ఆయుష్ శెట్టి రెండో రౌండ్‌కు ముందుంజ వేయగా.. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, మాళవిక బన్సోద్, ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే ఇంటి బాట పట్టారు. ప్రణయ్ 19-21, 21-17, 21-16తో నిషిమొటో(జపాన్)పై పోరాడి గెలిచాడు. కరుణాకరన్ 21-13, 21-14తో చౌ టైన్ చెన్ (చైనీస్ తైపీ)ను చిత్తు చేశాడు. ఆయుష్ 20-22, 21-10, 21-8తో బ్రియాన్ యంగ్ (కెనడా)ను ఓడించాడు. శ్రీకాంత్ 23-21, 21-13, 21-11తో ఆరో సీడ్ లు గువాంగ్ జు (చైనా)కు షాకిచ్చాడు. కానీ ప్రియాన్షు రజావత్ 21-15, 21-17తో జేసన్ (సింగపూర్) చేతిలో ఓడాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ 21-18, 15-21, 21-14తో మౌలానా-జమిల్ (ఇండోనేషియా)ను ఓడించి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది.

సెన్కోకాయ్ కరాటేకు ప్రపంచ గుర్తింపు

● ఫలించిన మాస్టర్ శాస్వత్‌కుమార్ కృషి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్‌కు చెందిన కరాటే మాస్టర్ హన్మి శాస్వత్ కుమార్ కృషి ఫలించింది. మార్షల్ ఆర్ట్స్‌లో డాక్టరేట్ పొందిన 36 ఏండ్ల శాస్వత్‌కుమార్ పలు అరుదైన రికార్డులను సొంతం చేసుకున్నాడు. 10 సెకన్ల వ్యవధిలో 112 బ్యాక్‌ఫిస్ట్ పంచ్‌లు సంధించి ప్రపంచంలోనే ఫాస్టెస్ట్ బ్యాక్ ఫిస్ట్ పంచర్‌గా రికార్డుల్లోకెక్కాడు. అంతటితో ఆగకుండా గత ఆరేండ్లుగా కరాటేలో వినూత్న ప్రయోగాలకు తోడు తన అద్భుత నైపుణ్యాన్ని జోడిస్తూ భారత్‌లోనే తొలిసారి కరాటేలో కొత్త రకం 'సెన్కోకాయ్ కరాటే'ను ఆవిష్కరించాడు. దీనిపై శాస్వత్‌కుమార్ మాట్లాడుతూ 'సెన్కోకాయ్ కరాటేకు ఇటీవలే జపాన్ మార్షల్ ఆర్ట్స్ నిపుణుల నుంచి గుర్తింపు లభించింది. జపాన్ గ్రాండ్ మాస్టర్ల సలహాలకు కఠోరమైన ప్రాక్టీస్‌తో కరాటేలో కొత్త శైలిని తీసుకొచ్చాను. షాటోకాన్, క్యోకుశిన్, మార్షల్ ఆర్ట్స్ కాంబినేషనన్‌లో సెన్కోకాయ్ కరాటే ఉంటుంది. సమాజంలో పోకిరీల ఆట కట్టించేందుకు అమ్మాయిలకు ఇది సెల్ఫ్ డిఫెన్స్‌గా ఉపయోగపడుతుంది. సెన్కోకాయ్ కరాటేలో పది వర్టినల్ కటా ఫీచర్లు ఉంటాయి' అని వివరించాడు. జపాన్ మార్షల్ ఆర్ట్స్ నుంచి శాస్వత్‌కుమార్ 10వ డాన్ బ్లాక్‌బెల్ట్ అందుకోవడం విశేషం.

ఆయనొక మూర్తీభవించిన ధర్మాగ్రహం

'కార్చిచ్చు మీద ఎంత వాన పడినా అది ఆగదు. పవన్‌కల్యాణ్‌గారు కూడా అలాంటివారే. జయాపజయాలతో సంబంధం లేకుండా దూసుకుపోతుంటారు. ఆయనతో మొదటిసారి చేస్తున్న సినిమా కాబట్టి చాలా శ్రద్ధతో పనిచేశాను' అన్నారు ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం.కీరవాణి. బుధవారం హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'హరిహరవీరమల్లు' చిత్రం నుంచి 'అసుర హననం' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి మాట్లాడారు. పవన్‌కల్యాణ్‌ను అందరూ పవర్‌స్టార్ అంటారని, తాను మాత్రం మూర్తీభవించిన ధర్మాగ్రహమని అభివర్ణిస్తానని, సమాజ శ్రేయస్సు కోసం ఆయన ధర్మాగ్రహాన్ని ప్రకటిస్తారని కీరవాణి అన్నారు. నిర్మాత ఎ.ఎం.రత్నంకు ఇండస్ట్రీలో వివాదరహితుడిగా పేరుందని, ఈ సినిమాతో మరో భారీ విజయాన్ని సాధించడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్ర సమర్పకుడు ఎ.ఎం.రత్నం మాట్లాడుతూ 'సినీరంగంలో 54ఏళ్ల ప్రయాణం నాది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పెద్ద సినిమాలు చేశా. అందులో 90శాతం విజయాలే. అనుకోని కారణాల వల్ల ఈ సినిమా ఆలస్యమైంది. విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం' అన్నారు. పవన్‌కల్యాణ్‌ను డైరెక్ట్ చేయడం అంటే ఓ అవార్డు గెలుచుకున్నంత ఆనందంగా ఉందని, ఓ గొప్ప చిత్రాన్ని ప్రేక్షకులకు అందించాలనే తపనతో పనిచేశానని, కత్తికి, ధర్మానికి మధ్య జరిగే యుద్ధమే ఈ కథ అని చిత్ర దర్శకుడు జ్యోతికృష్ణ తెలిపారు. ఎ.దయాకర్ రావు నిర్మించిన ఈ చిత్రం జూన్ 12న విడుదలకానుంది.

చిత్రం



'ఆర్‌సీ17' సన్నాహాల్లో..

రామ్‌చరణ్ ప్రస్తుతం పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. విలేజ్ స్పోర్ట్స్ డ్రామా ఇది. బుచ్చిబాబు సానా దర్శకుడు. ఇటీవల విడుదలైన గ్లింప్స్ సినిమాపై ఒక్కసారిగా అంచనాల్ని పెంచింది. ఈ సినిమా పూర్తయిన తర్వాత రామ్‌చరణ్-సుకుమార్ కాంబో సినిమా పట్టాలెక్కనుంది. ఏడాది క్రితమే ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. అయితే ఇప్పటివరకు ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో అసలు ఈ సినిమా ప్రీప్రొడక్షన్ ఎంతవరకు వచ్చింది? షూటింగ్ ఎప్పుడు మొదలవుతుంది? అంటూ అభిమానుల్లో చర్చ మొదలైంది. 'ఆర్‌సీ17' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా గురించి సుకుమార్ ఇంట్రిస్టింగ్ అప్‌డేట్ వెల్లడించారు. ఇటీవల తన స్వగ్రామానికి వెళ్లిన ఆయన 'ఆర్‌సీ17' గురించి మాట్లాడారు. తన తదుపరి సినిమా రామ్‌చరణ్‌తోనే ఉంటుందని, ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేసే పనిలో ఉన్నామని, ప్రీప్రొడక్షన్ వర్క్ వేగంగా జరుగుతున్నదని తెలిపారు. దీంతో అభిమానులకు ఈ సినిమాపై ఓ క్లారిటీ వచ్చినట్లైంది. 'రంగస్థలం' వంటి బ్లాస్‌బస్టర్ హిట్ తర్వాత సుకుమార్-రామ్‌చరణ్ కాంబోలో రాబోతున్న ఈ సినిమా పూర్వ నిర్మాణ దశలోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. 'రంగస్థలం' తరహాలోనే పతాక స్థాయి భావోద్వేగాలను ఆవిష్కరిస్తూ, ఓ సంఘర్షణాత్మక కథతో దర్శకుడు సుకుమార్ ఈ సినిమాకు సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది.

ఇక ఇంటర్నేషనలే టార్గెట్!

'పుష్ప-2'తో వైల్డ్‌ఫైర్‌లా దేశాన్ని చుట్టేసి రికార్డుల మోత మోగించారు అల్లు అర్జున్. ఇక 'జవాన్'తో పాన్ ఇండియా రేంజ్‌లో దర్శకుడిగా సత్తా చాటారు అట్లీ. వీరిద్దరి కలయికలలో సినిమా సెట్ కావడంతో ఇక బాక్సాఫీస్ రికార్డులన్నీ కనుమరుగే అంటూ అభిమానులు సంతోషంగా ఉన్నారు. అల్లు అర్జున్-అట్లీ కాంబినేషన్‌లో పాన్ వరల్డ్ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. గత నెలలోనే ఈ సినిమా ప్రకటన వెలువడింది. ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ నిర్మించనుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు ఊపందుకున్నాయి. బుధవారం దర్శకుడు అట్లీ హైదరాబాద్ చేరుకున్నారు. అల్లు అర్జున్‌తో కలిసి ఆయన ప్రీప్రొడక్షన్ తాలూకు చర్చల్లో పాల్గొనబోతున్నారు. జూన్‌లో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది. సైన్స్‌ఫిక్షన్ చిత్రమిదని సమాచారం. అంతర్జాతీయ ప్రమాణాలతో తెలుగులో రూపొందిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రమిదని మేకర్స్ చెబుతున్నారు. 'పుష్ప' అంటే నేషనల్ అనుకుంటివా? ఇంటర్నేషనలూ..' అంటూ 'పుష్ప-2'లో అల్లు అర్జున్ చెప్పిన డైలాగ్ తరహాలోనే..ఈ సినిమాతో బన్నీ ఇంటర్నేషనల్ బాక్సాఫీస్‌ను టార్గెట్ చేయబోతున్నారని ఆయన అభిమానులు కాన్ఫిడెంట్‌గా ఉన్నారు.

ధైవిక శక్తుల కిరాత

మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ ప్రస్తుతం బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్నారు. తెలుగు చిత్రం 'కన్నప్ప'లో ఆయన కీలక పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. మంచు విష్ణు టైటిల్ రోల్‌లో భక్తిరస ప్రధానంగా రూపొందిస్తున్న ఈ చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. బుధవారం మోహన్‌లాల్ జన్మదినం సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ చిత్రబృందం కొత్త గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో మోహన్‌లాల్ దైవిక శక్తులు కలిగిన కిరాత అనే పాత్రను పోషిస్తున్నారని, కథాగమనంలో ఆయన పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చిత్రబృందం వెల్లడించింది. 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌లాల్‌తో పాటు మోహన్‌బాబు, అక్షయ్‌కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ వంటి అగ్రతారలు భాగమవుతున్నారు. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

23న తుది నిర్ణయం?

సినిమా వసూళ్లలో పర్సంటేజ్ విధానాన్ని అమలు చేయాలని, అద్దె ప్రాతిపదికన సినిమాల్ని ప్రదర్శించడం వల్ల నష్టాలొస్తున్నాయని సింగిల్ థియేటర్ల యాజమాన్యాలు జూన్ 1 నుంచి బంద్ నిర్వహించే యోచనలో ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో నిర్మాతలు సమావేశమయ్యారు. ఎగ్జిబిటర్ల సమస్యలపై చర్చించారు. అయితే ఈ సమావేశంలో షేరింగ్ విధానంపై ఏకాభిప్రాయం కుదరలేదని తెలిసింది. దీంతో ఆల్‌సెక్టార్లతో ఓ కమిటీ ఏర్పాటు చేయాలని, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని నిర్మాతలు ప్రతిపాదించారు. ఈ నెల 23న మరోసారి డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో నిర్మాతలు సమావేశమై తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నారని సమాచారం.

'మళ్లీరావా' 'దేవదాస్' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులు దగ్గరైంది ఆకాంక్ష సింగ్. ఓవైపు వెబ్ సిరీస్‌లలో బిజీ ఆర్టిస్టుగా ఉంటూ సినిమాల్లో కూడా రాణిస్తున్నదీ భామ. ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం 'షష్టిపూర్తి' ఈ నెల 30న విడుదలకానుంది. రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి పవన్‌ప్రభ దర్శకుడు. రూపేష్ నిర్మాత. ఈ సందర్భంగా బుధవారం ఆకాంక్షసింగ్ విలేకరులతో సినిమా విశేషాలను పంచుకుంది. తల్లిదండ్రుల గొప్పతనాన్ని, వారి త్యాగాన్ని తెలియజెప్పే ఈ చిత్రాన్ని కుటుంబ సమేతంగా చూడాలని కోరింది. తన పాత్ర గురించి చెబుతూ 'ఈ సినిమాలో నేను గ్రామీణ ప్రాంతానికి చెందిన అచ్చ తెలుగమ్మాయి జానకిగా కనిపిస్తా. లంగా వోణితో తెరపై కనిపించడం గొప్ప అనుభూతినిచ్చింది. రాజమండ్రి గోదావరి పరిసర ప్రాంతాల్లో నెలరోజులు షూటింగ్ జరిగింది. గోదారి అందాలకు మైమరచిపోయా' అని చెప్పింది. రాజేంద్రప్రసాద్‌గారి దగ్గరి నుంచి ఎన్నో కొత్త విషయాలను తెలుసుకున్నానని, తామిద్దరం గ్లిజరిన్ అవసరం లేకుండానే ఎమోషనల్ సీన్స్‌ను రక్తి కట్టించామని, తెలియకుండానే కన్నీళ్లొచ్చేవని ఆకాంక్షసింగ్ పేర్కొంది.

తమిళ సోయగం త్రిష సెకండ్ ఇన్నింగ్స్ సక్సెస్‌పుల్‌గా కొనసాగుతున్నది. ముఖ్యంగా 'పొన్నియన్ సెల్వన్' సిరీస్ చిత్రాలతో ఈ భామ దశ తిరిగింది. అక్కడి నుంచి వరుసగా అన్నీ విజయాలే వరిస్తున్నాయి. ఆమె కమల్‌హాసన్ సరసన కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'థగ్‌లైఫ్' జూన్ 5న విడుదలకు సిద్ధమవుతున్నది. అగ్ర దర్శకుడు మణిరత్నం రూపొందిస్తున్న ఈ సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో అంచనాలేర్పడ్డాయి. బుధవారం ఈ సినిమా నుంచి 'షుగర్ బేబీ' అనే పాటను విడుదల చేశారు. ఏ.ఆర్.రెహమాన్ స్వరపరిచిన ఈ పాటను అనంతశ్రీరామ్ రచించారు. 'ఏం కావాలి నీకు, కొద్దికొద్ది గడుగు, ఇంకేం కావాలి నీకు, స్వర్గం తేనా ఇలకు, కల్లబొల్లి గుండె కన్నుమీటుతుందే..షుగర్ బేబీ' అంటూ సాఫ్ట్ అండ్ మెలోడీ బీట్‌తో ఈ పాట సాగింది. త్రిష తన అందచందాలతో మెస్మరైజ్ చేసింది. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించిన ఈ చిత్రంలో కమల్‌హాసన్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై ఎన్.సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.

కల్లబొల్లి గుండె కన్నుమీటుతుందే..

కొత్తలవాడిలో ప్రేమకథ

కన్నడ యువ హీరో పృథ్వీ అంబర్ నటిస్తున్న తాజా చిత్రం 'కొత్తలవాడి'. సిరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. అగ్ర హీరో యష్ తల్లి పుష్ప అరుణ్‌కుమార్ నిర్మాణరంగంలోకి అడుగుప